సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి



# సమ్మెకు సై!

## సన్నద్ధమవుతున్న కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు 16 నుంచి నిరవధిక సమ్మెలోకి

**స్టీల్‌ప్లాంట్‌లో సమ్మె సైరన్ మోగనుంది. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు అంశంలో యాజమాన్యం దిగి రాకపోవడంతో ఈనెల 16 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు నిర్ణయించాయి. ఆ మేరకు యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేశారు. కార్మిక శాఖ అధికారుల సమక్షంలో పలు మార్లు చర్చలు జరిగినా ఫలప్రదం కాలేదు. తొలగింపు అంశం తమ చేతుల్లో లేదని యాజమాన్య ప్రతినిధులు తేల్చి చెప్పడంతో సమ్మెకు సన్నద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా ప్లాంట్ ఉత్పత్తికి అంతరాయం కలగకుండా యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది.** – ఉక్కునగరం

స్టీల్‌ప్లాంట్ నష్టాల్లో ఉందని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చిన నాటి నుంచి ఉక్కు పరిరక్షణ ఉద్యమం కొనసాగుతోంది. అయితే ప్రైవేటు స్టీల్‌ప్లాంట్లతో పోలిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు అధికంగా ఉన్నారని ఉక్కు మంత్రిత్వశాఖ భావిస్తోంది. ఇందులో భాగం సుమారు 1130 మంది ఉద్యోగులను వీఆర్ఎస్ పేరుతో ఇంటికి పంపించేసింది. ఆ తర్వాత కాంట్రాక్ట్ కార్మికులపై పడింది.

**ఫలప్రదం కాని చర్చలు**

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలన్న డిమాండ్‌పై ఫిబ్రవరి 20న కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చాయి. దీంతో రీజనల్ లేబర్ కమిషనర్ కార్మిక సంఘాలు, యాజమాన్య ప్రతినిధులతో చర్చలు జరిపి ఇరు వర్గాలకు కొన్ని సూచనలు చేశారు. అయినప్పటికీ కార్మికుల తొలగింపు ఆగలేదు. దీంతో మార్చి 28న కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు ఒక రోజు సమ్మె చేశాయి. ఆ తర్వాత డిప్యూటీ లేబర్ కమిషనర్, రీజనల్ లేబర్ కమిషనర్ల సమక్షంలో చర్చలు జరిగాయి. తమకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలు అమలు చేయడం మినహా చేసేది ఏమీ లేదని యాజమాన్య ప్రతినిధులు స్పష్టం చేశారు. దీంతో కార్మిక సంఘాలు అంతిమంగా నిరవధిక సమ్మె చేయడం ద్వారా యాజమాన్యంతో తేల్చుకోవాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా ఈనెల 16 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపు నిచ్చాయి. గేట్ల వద్ద కరపత్రాలు పంచారు. గోడ పత్రికలు ఆవిష్కరించారు. వివిధ విభాగాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి కార్మికులను సమ్మెకు సమాయత్తం చేస్తున్నారు.

**కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళనలు ఇలా**

- 16, 17 తేదీల్లో మెయిన్ గేటు, బీసీ గేట్ల వద్ద కార్మికులతో నిరసనలు
- 18న గాజువాకలో కాంట్రాక్ట్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన
- 19న ఛలో కలెక్టరేట్
- 20 కూర్మన్నపాలెం దీక్ష శిబిరంలో నిరాహార దీక్షలు

**డిమాండ్లు ఇవీ**

- కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలి
- తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి
- కాంట్రాక్ట్ కార్మికులకు మెడికల్ టెస్టులు రద్దు చేయాలి

**యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు**

కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె వల్ల ప్లాంట్ ఉత్పత్తికి అంతరాయం లేకుండా యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. ఉత్పత్తి విభాగాల అధికారులకు 12 గంటల డ్యూటీలు వేయడంతో పాటు సర్వీసు విభాగాలకు చెందిన 450 మంది అధికారులను ఉత్పత్తి విభాగాల్లో 12 గంటల డ్యూటీలకు రోస్టర్ వేశారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 గంటల నుంచి మర్నాడు ఉదయం 8 గంటల వరకు వారు విధులు నిర్వహిస్తారు.

**మద్దతు కూడగడుతున్న కార్మిక నాయకులు**

**ఇదీ పరిస్థితి**

స్టీల్‌ప్లాంట్‌లో మొత్తం 14 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. గతంలో వివిధ కాంట్రాక్ట్ కార్మికుల రెన్యువల్‌ను నిలిపి వేయడం వల్ల సుమారు 644 మంది తగ్గిపోయారు. ఆ తర్వాత దఫదఫాలుగా మొత్తం 1500 మందిని విధుల నుంచి తొలగించారు. మరో 3 వేల మంది దశల వారీగా తొలగించడానికి సిద్ధమయ్యారు. తద్వారా కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య 9500కి తగ్గించనున్నారు.



### తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి

ప్రైవేటీకరణ ప్రక్రియలో భాగంగానే కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు చేపట్టారు. ఒకవైపు లోపల ఉత్పత్తి పెరుగుతుంటే కార్మికులను తొలగించడం అన్యాయం. కార్మికుల తొలగింపులు ఆపడంతో పాటు తొలగించిన వారిని విధుల్లోకి తీసుకునే వరకు సమ్మె కొనసాగిస్తాం.

– **నమ్మి రమణ**, ప్రధానకార్యదర్శి, సీఐటీయూ కాంట్రాక్ట్ కార్మిక సంఘం



### కార్మికుల తొలగింపు అన్యాయం

స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తుండడం అన్యాయం. ప్లాంట్‌పై ఆధారపడిన కార్మికుల కుటుంబాల పరిస్థితి ఏమిటి. కార్మిక శాఖ అధికారులతో చర్చలు జరుగుతుండగా కూడా తొలగింపులు కొనసాగడం అన్యాయం. యాజమాన్యం తమ చేతుల్లో ఏమీ లేదని చెప్పడం దారుణం.

– బొడ్డు పైడిరాజు, ప్రధానకార్యదర్శి, ఉక్కు శ్రామిక సంఘం

## క్లుప్తంగా

### అంబేడ్కర్ నిజమైన వారసుడు మోదీ



అంబేడ్కర్ విగ్రహం వద్ద దీపాలు వెలగిస్తున్న జీవీఎల్ నర్సింహారావు

**గాజువాక:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌కి నిజమైన వారసుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అని రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు అన్నారు. చినగంట్యాడ వందడుగుల రోడ్‌లోని అంబేడ్కర్ పార్కులో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేసి, ముగ్గులు వేసి దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లి దేముడు, నాయకులు సిరసపల్లి నూకరాజు, బాటా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### మేడే ఉత్సవాలు ప్రభుత్వమే నిర్వహించాలి

**అగనంపూడి:** మేడే ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వహించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విల్లా రామ్మోహన్‌కుమార్ అన్నారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వమే మేడే ఉత్సవాలు నిర్వహించి కార్మికుల శ్రమను గుర్తిస్తూ శ్రమశక్తి అవార్డులు ప్రదానం చేయాలన్నారు. కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, కొరాయి నాగార్జున, డొక్కా రమేష్, గంతకోరు అప్పారావు, శీరంశెట్టి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.


### ఘనంగా పరదేశి మాంబ విగ్రహ ప్రతిష్టాపన



అమ్మవారికి పూజలు చేస్తున్న కమిటీ పెద్దలు

**కూర్మన్నపాలెం:** జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్ దరి పెద యాతపాలెంలో నూతనంగా నిర్మించిన పరదేశి మాంబ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా ప్రతిష్టాపించారు. ఈ కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో కర్రి ములయ్య, సన్యాసినాయుడు, తుంపాల పరదేశి, కాదా శ్రీను పాల్గొన్నారు.

### పారిశుధ్య కార్మికురాలి మృతి



లక్ష్మి(ఫైల్)

**అగనంపూడి:** జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి ప్రాంతంలో పారిశుధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న అల్లం లక్ష్మి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. నిర్వాసిత కాలనీకి చెందిన లక్ష్మి కొంత కాలంగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### ముగిసిన ఇంటర్న్‌షిప్



ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న విద్యార్థులు

**గాజువాక:** గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో టెన్త్, ఇంటర్ విద్యార్థులకు వృత్తి విద్య కోర్సులపై నిర్వహించిన ఇంటర్న్‌షిప్ ఆదివారంతో ముగిసింది. ఎల్ఎస్‌జే స్కిల్స్ సంస్థ ఆధ్వర్యంలో పది రోజులపాటు నిర్వహించిన కార్యక్రమంలో ట్రైనర్ భారతివి ద్యార్థినులకు వివిధ రకాలైన డ్రెస్ కటింగ్, బ్లౌజ్ కటింగ్‌లను నేర్పించారు. ఎల్ఎస్‌జే సంస్థ జిల్లా కో ఆర్డినేటర్లు మెట్ల సుధాకర్‌బట్లు, రిషి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.విజయ ప్రశాంతి, ఇంటర్న్‌షిప్ అధికారి డాక్టర్ ఖలీషా పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి నిర్వహించనున్న సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఉక్కు కార్మిక సంఘం కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తుందన్నారు. తమకు గత్యంతరం లేక సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో నమ్మి రమణ, జి. శ్రీనివాసరావు, మంత్రి రవి, కె. వంశీకృష్ణ, ఆనంద్, కోన రమణ తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

**అక్కిరెడ్డిపాలెం:** స్కూటీపై వెళ్తూ జారిపడిపోయిన వ్యక్తిపై నుంచి లారీ వెళ్లడంతో దుర్మరణం పాలయ్యాడు. ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంపై గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు.. పాలవలసకు చెందిన కాకి బాలాజీ రావు (45) ట్రాన్స్ పోర్టు పనులు చేస్తుంటాడు. బాలాజీ రావు రాత్రి పాలవలస నుంచి స్కూటీపై గాజువాక వచ్చాడు. సరిగ్గా వై జంక్షన్ నుంచి 100 అడుగుల రోడ్డుకు వస్తున్న మార్గంలో జంక్షన్ దాటిన తర్వాత రోడ్డు నిర్మాణ సామగ్రి ఉండడంతో జారి పడిపోయాడు. ఇదే సమయంలో గంగవరం పోర్టు నుంచి వెనుక వస్తున్న లారీ బాలాజీ రావుపై ఎక్కేసింది. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య, ఇంటర్ చదువుతున్న కుమార్తె, 10వ తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారని పోలీసులు తెలిపారు.

## తప్పిన పెను ప్రమాదం

**అక్కిరెడ్డిపాలెం:** రెడీమిక్స్ లారీ డ్రైవర్ ముందు వెళ్తున్న కారును ఢీ కొట్టాడు. అయితే కారులో ఉన్న వారంతా సురక్షితంగా బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో కారు పక్క భాగం నుజ్జయ్యింది. వివరాలు.. ఎన్ఏడీ నుంచి పాతగాజువాక వైపు కారులో ఆదివారం భాస్కరరావు అనే వ్యక్తి భార్య ఇద్దరు పిల్లలతో వెళ్తున్నారు. వీరి కారు షీలానగర్ పెట్రోల్ బంక్ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వస్తున్న రెడీమిక్స్ లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ప్రమాదంలో కారు ఉన్న నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు వివరాలు సేకరించారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని పలువురు తెలిపారు.

## నడకతో సంపూర్ణ ఆరోగ్యం



సమావేశమైన వాకర్స్ క్లబ్ మింది సభ్యులు

**అక్కిరెడ్డిపాలెం:** నడకతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మాజీ కార్పొరేటర్ ఉరుకూటి అప్పారావు, మిందిగ్రామ పెద్ద ఈటి రంగారావు అన్నారు. భెల్ క్రీడా మైదానంలో ఆదివారం వాకర్స్ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మింది, పరిసర ప్రాంతాలకు చెందిన 150 మంది సభ్యులు హాజరయ్యారు. మిత్రులతో కలిసి నడకను కొనసాగించడం ఎంతో ఆనందంగా ఉంటుందని తెలిపారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఈడువుగంటి అనార్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి భాస్కరరావు, కోశాధికారి అజయ్‌కుమార్, భెల్ ఇంటక్ నాయకుడు ఉరుకూటి బాబూరావు, పాపారావు, మడిసి రాము, వైఎస్సార్ సీపీ నాయకుడు సంద్రాన నూకరాజు, డీఈ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న క్రైం సీఐ సింహాచలం

**గాజువాక:** సత్యసాయిబాబా జన్మదిన వేడుకల్లో భాగంగా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో పాతగాజువాకలో చలివేంద్రం ప్రారంభించారు. గాజువాక, బీహెచ్ఈఎల్, సమితుల ఆధ్వర్యంలో పాతగాజువాక 38 బస్టాప్‌వద్ద ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు ప్రారంభించారు. కేంద్రాన్ని 60 రోజుల పాటు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో గాజువాక క్రైం సీఐ సింహాచలం, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ ఆర్.ఎ.నాయుడు, సిటీ సమితి కన్వీనర్ సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ధర్మ పరిరక్షణ బాధ్యత అందరిది

**గాజువాక:** సనాతన హిందూ ధర్మాన్ని కాపాడే బాధ్యత అందిరిపైనా ఉందని రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. హిందూధర్మ పరివార్ ఆధ్వర్యంలో పాతగాజువాకలో నిర్వహించిన మేలుకో– హిందూ మేలుకో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన పూజా విధానంలో సర్వేజన సుఖినోభవంతు అని అంటామని, ప్రపంచంలో వున్న ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నదే దాని అర్థమని అన్నారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బాల త్రిపురేంద్రస్వామి, యోగారాజు, రాందాస్ గురూజీ, కరణంరెడ్డి నర్సింగరావు, దీనంకొండ కృష్ణంరాజు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



ర్యాలీ చేస్తున్న రాంనగర్ యునైటెడ్ ఇమాన్యుయెల్ చర్చి సభ్యులు

**అక్కిరెడ్డిపాలెం:** మట్టల ఆదివారాన్ని ఏసుక్రీస్తు ఆరాధికులు ఘనంగా నిర్వహించారు. రాంనగర్‌లోని యునైటెడ్ ఇమాన్యుయెల్ చర్చి ప్రతినిధులు, భక్తులు మట్టలను చేతపట్టి వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. యేసు విజయోత్సాహంతో యెరూషలేము ప్రవేశం చేయడమే మట్టల ఆదివారం ప్రాముఖ్యం అని పాస్టర్స్ డాక్టర్ జాకబ్, ఏ.ఎస్.కుమార్‌లు అన్నారు. కార్యక్రమంలో చర్చి అధ్యక్షుడు జి.మిలన్, కార్యదర్శి ఎస్.డేవిడ్ జెమ్స్ రాయ్, కోశాధికారి కె.రాజశేఖర్, అడ్వైజర్స్ పి.భాస్కరరావు, జి.ఎఫ్.లివింగ్‌స్టన్, రోజీ ఈవిలిన్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమాంబ ఆలయానికి బెంచీల వితరణ



బెంచీలను ప్రారంభిస్తున్న కొత్త కర్ణవానిపాలెం కమిటీ సభ్యులు

**పెదగంట్యాడ:** కొత్త కర్ణవానిపాలెంలోని పైడిమాంబ, దుర్గమాంబ ఆలయానికి ఆదివారం సిమెంట్ బెంచీలు బహూకరించారు. కలుకూరి సుబ్బారావు (తాతాలు) జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కులుకూరి మంగరాజు వీటిని అందజేసి ప్రారంభించారు. కార్యక్రమంలో చవాకుల అప్పలరాజు, వజ్రాన త్రినాథ్ యాదవ్, విరోతి భాస్కర్, విరోతి గోవింద్, విరోధి వరహాలరావు, కర్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపాలి



గ్రామ సభలో నాయకుల సంఘీభావం

**పెదగంట్యాడ:** విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం ఇళ్లు, భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపించాలని కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహాదేవ్, లీడర్ రమణమూర్తి డిమాండ్ చేశారు. ఉక్కు నిర్వాసితుల కాంట్రాక్ట్ లేబర్ యూనియన్, నిర్వాసితుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో గంగవరం గ్రామంలో ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు నిర్వాసితులకు 44 ఏళ్ల నుంచి ఎటువంటి ఉపాధి కల్పించలేదన్నారు. నిర్వాసితులకు ప్రతి నెలా రూ.25వేల వంతు జీవన భృతి కల్పించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే ఆర్ కార్డుదారులందరికీ ఎకరం చొప్పున భూమి ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఉమ్మడి అప్పారావు, కొవిరి అవతారం, పితాని భాస్కరరావు, రామ్‌రెడ్డి, మస్తాన్, శ్రీనివాసరావు, కృష్ణారావు, పరంధామయ్య, దేవుడు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యసాయి పల్లకీ సేవ



నడుపూరులో పల్లకీ సేవ నిర్వహిస్తున్న సమితి సభ్యులు

**పెదగంట్యాడ:** సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాల్లో భాగంగా ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. నడుపూరు భజనమండలి కన్వీనర్ నరవ శ్రీను ఆధ్వర్యంలో జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరు, బోయవీధి, ఆర్యవైశ్య వీధి, కుమ్మరివీధి, యాదవ వీధి, కర్నాల వీధి, కాపుదొడ్డి తదితర ప్రాంతాల్లో పల్లకీ సేవ నిర్వహించారు. గళ్లా శంకర్‌సాయిరాం, బి.బాబూరావు, ఎం.కొండబాబు, ఆదిరెడ్డి, భాస్కర్, పైడినాయుడు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## సీతారాముల ఆలయ నిర్మాణానికి విరాళం



చెక్ అందిస్తున్న దాత రామ అప్పారావు

**అగనంపూడి:** జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలో నిర్మిస్తున్న సీతారాముల ఆలయ నిర్మాణానికి వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు రూ.30వేల చెక్‌ను ఆలయ కమిటీకి అందించారు. రామ అప్పారావు రెండు విడతల్లో రూ.20వేలు అందించగా తాజాగా ఆదివారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.30వేల చెక్ అందించారు. అగనంపూడి వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు మడగల నరసింగరావు, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యకలాపాల్లో రామ అప్పారావు భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు నారాయణరావు, గొట్యాడ లోవరాజు, కరణం సన్ని, చిరురాజు పాల్గొన్నారు.

**పెదగంట్యాడ:** నెల్లిముక్కు గ్రామ పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పెంటమాంబ అమ్మవారి ఆలయ అభివృద్ధికి పాత అయ్యన్నపాలెం అధ్యక్షుడు గొందేశి నాగిరెడ్డి రూ.10,116 విరాళం అందజేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కు రిటైర్డ్ ఉద్యోగికి సత్కారం



రాము దంపతులను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ మెయిన్ రిసీవింగ్ స్టేషన్ విభాగం నుంచి పదవీ విరమణ చేసిన స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకుడు బడగల రామును ఘనంగా సత్కరించారు. ఆదివారం స్టీల్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 87వ వార్డు అధ్యక్షుడు బొడ్డు గోవింద తదితరులు రాము దంపతులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాము పార్టీతో పాటు వైఎస్సార్‌టీయూసీలో కీలకంగా ఉంటూ అందరి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రగడ శ్రీను, బొడ్డ సన్యాసిరావు, చిత్రాడ వెంకటరమణ, దుగ్గపు రవి, ప్రగడ శంకరరావు, బొడ్డ సూరిబాబు, జి. సన్యాసినాయుడు, జి. రామారావు, పి. రవి, సంతోష్ పాల్గొన్నారు.

## తాగునీటి సౌకర్యం కల్పించాలి

**పెదగంట్యాడ:** టిడ్కో గృహ సముదాయాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సీపీఐ గాజువాక నియోజకవర్గ వర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు భానోజీతోటలోని టిడ్కో లబ్ధిదారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే అధికారులు స్పందించి తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అచ్యుతరావు, కృష్ణారావు, తిరుపతిరావు, తిరుమలరావు పాల్గొన్నారు.

## సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**గాజువాక:** స్థానిక ఎంవీఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు మాట్లాడుతూ ఇక్కడ విద్యనభ్యసించి ఉన్నత స్థానాల్లో స్థిరపడినవారిని అభినందించారు.
కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ఈశ్వరరాజు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రామసన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.